ప్రియదర్శిని పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతా



పార్కులో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ప్రియదర్శిని పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ ట్యాంక్ బండ్‌పై ఉన్న ప్రియదర్శిని పార్కులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గతంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పాడైయిందని వెంటనే మరమ్మతు చేపట్టి నూతన పరికరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పార్కుకు వచ్చే వాకర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అభివృద్ధి చేస్తామన్నారు. పార్కులో సేద తీరేందుకు, యోగా చేసేందుకు అనువైన స్థలాలను అభివృద్ధి చేయడంతో పాటు, వాలీబాల్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేశామన్నారు. పార్కులో మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు పట్టేందుకు బోరు కూడా వేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు వరప్రసాద్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు తిలక్‌రావు, నాయకులు తోట రాజశేఖర్, మధుసాగర్, శ్రీకాంత్, ఆశీశ్, నరేష్, సుధీర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

నాగోలు: కాలనీల్లో తలెత్తుతున్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. శ్రీ శంకర్‌కాలనీలో బుధవారం ఆయన స్థానికులతో కలిసి పర్యటించి పలు సమస్యలను పరిశీలించారు. కాలనీలో డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని గతంలో వేసిన డ్రైనేజీ లైన్లు ధ్వంసమై నిత్యం నీళ్లు పొంగిపొర్లుతుండటంతో కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. కాలనీలోని అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ గతంలో పైకప్పు కూలిపోవడంతో మరమ్మతు చేయించాలని అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో, ఏఈ మాతృనాయక్‌తో కలిసి కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించడం జరిగిందని మరమ్మతు చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట కాలనీ అధ్యక్షుడు కృష్ణ, రమేష్ చారి, సంగీత, భాస్కర్, దయాకర్, అఖిల్ ఉన్నారు.

బీసీ సదస్సును జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మన్సూరాబాద్: బీసీల సమరశంఖం పేరిట బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈ నెల 11,12 తేదీల్లో జరిగే బీసీల జాతీయ సెమినార్, ధర్నాను జయప్రదం చేయాలని బీసీ డాక్టర్స్ ఫోరం కన్వీనర్ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సదస్సు, ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బీసీ సంఘాల నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలని, సామాజిక సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఢిల్లీలో జరిగే బీసీల శంఖారావంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీల్లోని బీసీల ఎంపీలు పాల్గొనాలని కోరారు. ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, నాయకులు కేవీగౌడ్, కొండల్‌గౌడ్, వేణు, శ్యాంసుందర్, వెంకటేష్, శ్రీధర్, స్వామి, మానం శ్రీను, భద్రీ పాల్గొన్నారు.

వాహనాల దొంగ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

చైతన్యపురి: కార్లు, ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న పాత నేరస్తుడిని రిమాండ్‌కు తరలించిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. గోల్కొండ ఫోర్ట్ సమీపంలో నివసించే సయ్యద్ సాహిల్ (23) చెడు అలవాట్లకు బానిసై బైక్‌లు, కార్లు దొంగిలించడం అలవాటు పడ్డాడు. చైతన్యపురిలో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై వచ్చిన సయ్యద్ సాహిల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పాత నేరస్తుడిగా గుర్తించారు. గతంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో పలు వాహనాలు దొంగతనం చేసి జైలుకు వెళ్లివచ్చాడు. దొంగిలించిన పలు వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

జ్యూట్ బ్యాగులనే వాడాలి



గాజు గ్లాసులు అందజేస్తున్న అధికారులు

వనస్థలిపురం: హానికారక ప్లాస్టిక్, పేపర్ టీ గ్లాసులు వాడొద్దంటూ జాగృతి అభ్యుదయ సంఘం, కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కమలానగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీ షాపుల దుకాణాదారులకు గాజు గ్లాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జీహెచ్‌ఎంసీ డీఈఈ డా.నీలిమ, స్వచ్ఛ భారత్ మిషన్ ఐఈసీ నిపుణుడు డా.శంకర్ పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులు, బట్ట సంచులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, సుబ్బారావు, మల్లికార్జున్, ఓబులేష్ యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ డీసీ మాకొద్దంటూ సిబ్బంది ధర్నా



సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్ తమను వేధింపులకు గురిచేస్తున్నారని, వెంటనే తొలగించాలని పలువురు ఉద్యోగులు, సిబ్బంది బుధవారం కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమయపాలన లేకుండా పనులను పురమాయిస్తారని, ఎప్పుడు పడితే అప్పుడు కార్యాలయానికి రావాలని ఒత్తిడికి గురి చేస్తారని ఆరోపించారు. ఇలా తొందర పెట్టడంతో కార్యాలయానికి వస్తున్న ఇద్దరు టాక్స్ ఇన్‌స్పెక్టర్లు రోడ్డు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అన్నారు. మహిళ ఉద్యోగులకు రాత్రి 8 గంటల వరకు పనులు చెబుతుంటారని ఆరోపించారు. ఈ ధర్నాలో బీఎంయూ ఈస్ట్ జోన్ అధ్యక్షులు యాదగిరి, హర్షఫ్, శ్రీధర్, పెంటయ్య, శ్రీనివాస్,శంకర్, కిషోర్, రవికుమార్,అంజనేయులు, యాదయ్య, సత్యనారాయణ, రాకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు. సర్కిల్ సిబ్బంది తనపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, నిబంధనలకు లోబడే పనులను చెప్పడం జరిగిందని డీసీ సేవా ఇస్లావత్ వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులను పురమాయించడం జరిగింది తప్ప తన సొంత నిర్ణయాలతో సిబ్బందిని ఇబ్బంది పెట్టలేదన్నారు.

‘హామీల అమలులో ప్రభుత్వం విఫలం’

హస్తినాపురం: ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో ప్రభుత్వం విఫలమైందని హస్తినాపురం డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షుడు నరేశ్ యాదవ్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల కరపత్రాలతో బుధవారం హస్తినాపురం చౌరస్తాలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా విజయోత్సవాలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.వందల కోట్లతో ప్రచారం చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ ఈ నెల 7న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, రాజుగౌడ్, జీవన్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, కోట్లశివ, రాఘవయాదవ్, శివారెడ్డి, శేఖర్‌గౌడ్, సాయిరెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ, బైక్‌ర్యాలీ..

ఎల్‌బీనగర్: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందంటూ ఆరోపిస్తూ అందుకు నిరసనగా బుధవారం బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురం రైతుబజారు వరకు బీజేపీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ వైఫల్యాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌గౌడ్, నవకిషోర్‌రెడ్డి, శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.29, వంకాయ రూ.28, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.32, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.55, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.54, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.23, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.35, మునగ రూ.255, చిలుకడ దుంప రూ.60, బీట్‌రూట్ రూ.50, కీర రూ.20, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కొనసాగుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

నాగోలు: ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్టీఆర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ ముందు నుంచి విజయవాడ–హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు ఆక్రమణలను బుధవారం కూడా తొలగించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌లను అడ్డాగా చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అవయవదానం



అంజమ్మ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపింది ఓ వృద్ధురాలు. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రానికి చెందిన బైరు అంజమ్మ (68), గత నెల 28న అకస్మాతుగా ఇంట్లో కిందపడి పోయింది. హుటాహుటిన కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించగా ఐసీయూలో ఉంచి చికిత్స అందించిన వైద్యులు ఈ నెల 3న బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. సమాచారం అందుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు అంజమ్మ భర్త సత్తయ్య, కుమారుడు సుదర్శన్‌కు అవయవదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారంతో అంజమ్మ లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌ధాన్‌కు దానం చేశారు.

నిత్య వెలుగులు.. ఆర్పేదెవరు?



ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. సాయంత్రం వెలిగి ఉదయం ఆరిపోవాల్సి ఉండగా వాటిపై నిర్వహణ లేక నిరంతరం వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ దీపాలపై దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. – వనస్థలిపురం

జీఎస్‌ఐలో సమస్యలు పరిష్కరించాలి



అసిత్‌కుమార్ సాహును సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ)లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్, రీజినల్ కార్యదర్శి మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో జీఎస్‌ఐ డైరెక్టర్ జనరల్ (డీజీ) అసిత్ కుమార్ సాహుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మహేష్, సత్యనారాయణ మాట్లాడుతూ.. బండ్లగూడ జీఎస్‌ఐ ఆడిటోరియం శిథిలావస్థలో ఉందని, ఆధునీకరణ చేయాలన్నారు. గత 20 ఏళ్లుగా ఒకే పోస్టు, క్యాడర్‌లో ఉన్న స్టోర్స్ స్ట్రీమ్ పోస్టులను తగ్గించడంతో ప్రమోషన్లు నిలిచిపోయాయని డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఏడీజీ హెచ్‌ఓడీ పట్‌భాజే, డైరెక్టర్ హర్మోహన్ మిషరా, అసోసియేషన్ నేతలు శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, మేఘురాజ్, ప్రభాకర్, ప్రకాష్‌రావు, అమర్నాథ్, దేవయ్య నాయుడు, అనిల్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

గంగుల జనార్దన్‌రెడ్డి సేవలు మరువలేనివి



గంగుల జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని మహాత్మా గాంధీ లా కళాశాల చైర్మన్ గంగుల గోవర్ధన్ రెడ్డి తండ్రి గంగుల జనార్దన్‌రెడ్డి ఏకాదశ దినకర్మ మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణపురం డివిజన్ అల్కాపురి ఓ హోటల్ కన్వెన్షన్‌లో బుధవారం నిర్వహించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, మల్టీజోన్ ఐజీ వి.సత్యనారాయణ అనిల్, యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, మాజీఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, యూత్ యాక్టివిటీస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, హైర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొని జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

మలక్‌పేట పాఠశాలను సందర్శించిన ఆకునూరి మురళి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మురళి

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి బుధవారం మలక్‌పేట ఉన్నత పాఠశాలను సందర్శించారు. దాదాపు రెండు గంటల పాటు విద్యార్థులతో గడిపారు. తరగతి గదులు, ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీసి మధ్యాహ్న భోజనం చేశారు. మలక్‌పేటలో 2 ఎకరాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, మధ్యాహ్న భోజనం నాణ్యత మెరుగు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని చెప్పారని సైదాబాద్ మండల డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ తిరునగరి రాధా కృష్ణ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ ఆత్మహత్య

నాగోలు: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..కామారెడ్డి జిల్లా, నిజాంసాగర్ మండలం, రావుపల్లి గ్రామానికి చెందిన మహారెడ్డి సుదర్శన్‌రెడ్డి చిన్న కూతురు కటిక వాణి(39)కి ఎల్‌బీనగర్‌లోని సాగర్‌రింగ్ రోడ్డు సమీపంలోని అనుపమనగర్‌లో ఉండే మధుసూదన్‌రెడ్డితో రెండో వివాహం జరిగింది. వీరికి ఓ కుమార్తె ఉంది. గత కొన్ని సంవత్సరాల నుంచి రాజేంద్రనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అకౌంటెంట్‌గా పని చేస్తుంది. గత వారం రోజుల నుంచి ఆరోగ్యం సరిగా లేదని ఆఫీస్‌కి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటుంది. విషయం తెలుసుకున్న వాణి తల్లిదండ్రులు సుదర్శన్‌రెడ్డి, సరస్వతి ఈ నెల 3న అనుపమనగర్‌లోని కుమార్తె ఇంటికి వచ్చారు. అదే రోజు అర్ధరాత్రి తల్లి సరస్వతి వాష్‌రూమ్ కోసం బాత్రూమ్ తలుపు నెట్టగా లోపలి నుంచి లాక్ పెట్టి ఉంది. భర్త సుదర్శన్‌రెడ్డి, అల్లుడు మధుసూదన్‌రెడ్డికి విషయం చెప్పగా తలుపు పగలగొట్టి చూసే సరికి వాణి కండువాతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

దోషులను కఠినంగా శిక్షించాలి

దిల్‌సుఖ్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులు, దేవాలయాలు, స్వామీజీలపై జరిగిన దాడులకు నిరసనగా ఆర్‌కేపురంలో శ్రీ శైవక్షేత్రం పీఠం నుంచి కొత్తపేట శ్రీ భవానీమాత దేవస్థానం వరకు బుధవారం రాత్రి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వధర్మ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఆత్మానంద భారతి స్వామీజీ, శివ కామేశ్వరి మాతాజీ, రామకృష్ణాపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ..బంగ్లాదేశ్ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి హిందూ దేవాలయాలపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ.కుమార్, కోటేశ్వరరావు, శ్రీనివాస్, ప్రవీణ్‌దూబే, సామమూర్తి, వాసు, రేణుకా పాల్గొన్నారు.



మాదన్నపేట పోలీసు అధికారుల వివరాలు

సౌత్‌ఈస్ట డీసీపీ పాటిల్ కంతిలాల్ సుభాష్	– 8712661560
అదనపు డీసీపీ స్వామి	– 8712661562
ఏసీపీ వెంకన్న నాయక్	–8712661565
మాదన్నపేట పోలీస్ స్టేషన్	–04027854784, 04027854967, 8712661297
పెట్రోలింగ్	– 8712664579, 8712664580
ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస్	–8712660388
డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం. దాసు	–8712661039
ఎస్‌ఐ వెంకటరమణ	–8712661020
ఎస్‌ఐ శోభ	– 8712661043

– చంచల్‌గూడ

ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చంపాపేట: ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో ఈఓ లావణ్య ఆధ్వర్యంలో గణపతి హోమం, మన్యు సూక్త సహిత సుదర్శన హోమం నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలలో స్వామిరి, అమ్మవారి ఆలయాలలో అభిషేకాలు, అర్చనలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అంబ ప్రసాదు, సంతోష్‌శర్మ, శుక్లా, మురళీధర్‌శర్మ, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది వెంకటయ్య, వేణుగోపాల్, సుజాత, రమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

సురేష్‌కు ఉత్తమ వీల్‌చైర్ క్రికెటర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ధరవత్ సురేష్

మన్సూరాబాద్: రాష్ట్ర మహిళా శిశు, సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సహకార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతీలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎల్‌బీనగర్‌కు చెందిన వీల్‌చైర్ క్రికెటర్, దివ్యాంగుడు ధరావత్ సురేష్ పారా స్పోర్ట్స్ విభాగంలో ఉత్తమ వీల్ చైర్ క్రికెటర్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర మంత్రి సీతక్క, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, కమిషనర్ శైలజ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన దివ్యాంగులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

నేడు జైళ్ల శాఖలో పాసింగ్ ఔట్ పరేడ్

చంచల్‌గూడ: చంచల్‌గూడలోని జైళ్ల శాఖ పరేడ్ మైదానంలో నేడు(గురువారం) జరగనున్న పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కానున్నట్లు జైళ్లశాఖ అధికారులు తెలిపారు. ఉదయం 8.30లకు కార్యక్రమం ప్రారంభమవుతుందని జైళ్ల శాఖలో వార్డర్‌లుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.